ఈనాడు నిజామాబాద్
బుధవారం అక్టోబరు 2, 2024

బాపూ బాట.. ఆరోగ్య మూట

గాంధీ జయంతి నేడు

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్



మహాత్మా గాంధీ.. బతికింది 79 ఏళ్లు.. చనిపోయి 76 ఏళ్లయినా ఆయన చూపిన బాట అనుసరణీయం. బాపూజీ ఆలోచనలు ఆధునిక సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యకర జీవనశైలిని అనుసరించాలని పరిశోధనలు చేసి చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు ఇప్పుడు చెబుతున్నవన్నీ అలనాడు గాంధీజీ తన నిత్య జీవితంలో ఆచరణలో చూపించారు. అందుకే మానసికం, శారీరకంగా దృఢంగా ఉండి.. జాతికి విముక్తి కల్పించే దీక్షలో విజయవంతమయ్యారు. ప్రస్తుతం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఆయన జీవన విధానాన్ని అనుసరిస్తే దృఢంగా తయారవుతాం. ఉమ్మడి జిల్లా ప్రజల కోసం ఆయన అభిరుచులు, అలవాట్లపై 'న్యూస్‌టుడే' కథనం.

ధ్యానం, వ్యాయామం



బాపూ ఉదయం, సాయంత్రం వేళల్లో ధ్యానం చేస్తుండేవారని చెబుతారు. ధ్యానంతోనే సత్యాగ్రహంతో అహింసా విధానానికి కట్టుబడి ఉన్నారు. సైబర్ యుగంలో ఎదుర్కొంటున్న ఒత్తిడిని అధిగమించడానికి ధ్యానం, వ్యాయామం ప్రతి ఒక్కరికీ అవసరమే.

వ్యసనాలకు దూరం



గాంధీ టీ, కాఫీ వంటి వాటికి బదులుగా తేనె, వేడి నీటిని ఎంచుకున్నారు. ప్రాణాంతక వ్యాధులకు కారణమైన మద్యం, పొగాకుకు దూరంగా ఉండాలని ప్రబోధించారు. ఇప్పుడు టీ, కాఫీ, శీతల పానీయాల విషయంలో వేడినీరు, నిమ్మరసం తాగడం అలవాటు చేసుకుంటే శరీరానికి మేలు.

రోజువారీ నడక



మహాత్ముడు 40 ఏళ్లు దాదాపు రోజుకు 18 కి.మీ నడిచిన సందర్భాలున్నాయి. అలా 79వేల కి.మీ నడిచారని చెబుతారు. ఆయన దృఢంగా ఉండటానికి కారణం నడకే. కారణలేమైనా 52 శాతం మంది భారతీయులు నడక, వ్యాయామానికి దూరంగా ఉంటున్నారని ఇటీవల ఒక సర్వే పేర్కొంది. ప్రతి వ్యక్తి రోజుకు అరగంట నడిస్తే ఆరోగ్యానికి మేలని నిపుణులు చెబుతున్నారు.

క్రమమైన నిద్ర



శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలని ఆరు గంటలు నిద్రపోయేవారట. ప్రస్తుతం నిద్రలేమి సమస్య సాధారణమైంది. నిద్రకు సమయపాలన లేకుండా పోయింది. సమతుల్యం లోపించి అనారోగ్యాలు వెంటాడుతున్నాయి. క్రమమైన నిద్ర అలవరచుకోవాలి.

ఆరోగ్యానికి ఉపవాసం




ఆరోగ్యం కోసం ఉపవాసం ఆచరించేవారని చెబుతారు. ఈ దీక్షలే బ్రిటీషర్లపై నిరసనకు ఆయుధంగా వినియోగించారు. కొవ్వులు తగ్గించి, పేగుల కదలికలు క్రమబద్ధీకరించడం, జీవనశైలి వ్యాధులు నియంత్రణకు దోహదం చేసే ఉపవాసం అనుసరిస్తే మేలు.

సానుకూల దృక్పథం




గాంధీజీ మనసును సానుకూలంగా ఆలోచించేలా తీర్చిదిద్దాలని విశ్వసించారు. ప్రశాంతమైన మనసు ఎలాంటి పరిస్థితి, సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సాయపడటంతో పాటే అనారోగ్య పరిస్థితులు దూరం చేస్తుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సానుకూల దృక్పథమే ఒక నైపుణ్యంగా మారింది. దాన్ని అలవరచుకోవాలి.

ప్రకృతిని ప్రేమించడం



ప్రకృతి ప్రతి ఒక్కరి అవసరాలు తీర్చడానికి సరిపోతుంది. కానీ ఎవరి దురాశను తీర్చడానికి కాదని చెప్పేవారు. ఈ అభిప్రాయం నేటి తరానికీ అవసరమే. దురాశతో చెట్లు నరకడం, జలవనరులు ఆక్రమించడం, ఇసుక, గుట్టలు కొల్లగొట్టడంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది.

చదవడం, రాయడం



మహాత్ముడు వివిధ పుస్తకాలు, దినపత్రికలు చదివేవారు. చదవడంతోనే మానసిక స్థితి మెరుగుపరచుకున్నారని చెబుతారు. రాయడంలోనూ దిట్ట. పుస్తకాలు, లేఖలు, పత్రికలకు వ్యాసాలు రాశారు. ప్రస్తుత తరం పిల్లల్లో తగ్గిపోయిన పఠనాసక్తి ప్రమాదకరమని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. పిల్లల చేత పుస్తకాలు చదివించడంతో పాటు రాయడం సాధన చేయించాలని సూచిస్తున్నారు.

సేవాభావం

పేదలకు సేవ చేయాలనే తపన ఆయనకు ఉండేది. సేవా దృక్పథం అలవరచడానికి కృషి చేశారని చెబుతారు. మన పనులు మనమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములవ్వాలి.

ఆహారపు అలవాట్లు



గాంధీజీ తాజా కూరగాయలకు, ఫలాలు, చిరుధాన్యాలు, పరిమిత నూనె, ఉప్పు, మసాల దినుసులు, శాకాహారానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుతం సమతుల ఆహారానికి విరుద్ధమైన ఆహారం తీసుకుంటున్నాం. ఫలితంగా జీవన శైలి వ్యాధులు సంభవిస్తున్నాయి. అందుకే మహాత్ముడి ఆహారపు అలవాట్లను అనుసరించాలి.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 రెండు జిల్లాలకు సంబంధించి పలు విషయాలు వెల్లడించింది. దీని ఆధారంగా ఆయా జీవనశైలి వ్యాధుల సమస్యలు ఇలా ఉన్నాయి. (శాతాల్లో)

★ నిజామాబాద్
● కామారెడ్డి

15 ఏళ్లు పైబడిన వారిలో పొగాకు అలవాటు
మహిళలు ★ 8.6 ● 5.6
పురుషులు ★ 20.6 ● 25.7

15 ఏళ్లు పైబడిన వారిలో మద్యం అలవాటు
మహిళలు : ★ 9.8 ● 16.7
పురుషులు ★ 40.2 ● 41.8

15-49 ఏళ్ల మధ్య వయస్కుల్లో రక్తహీనత	★ 57.0	● 58.9
ఈ వయస్కుల్లో బాడీమాస్ ఇండెక్స్ సాధారణం ఉన్నవారు	★ 21.0	● 21.7
అధిక బరువున్నవారు	★ 27.5	● 21.0
రక్తపోటు మహిళల్లో	★ 27.1	● 27.7
రక్తపోటు పురుషుల్లో	★ 31.2	● 29.1
మధుమేహం మహిళల్లో	★ 13.5	● 12.9
మధుమేహం పురుషుల్లో	★ 15.6	● 17.5

బతుకమ్మకు వేళాయె

నేటి నుంచి వేడుకలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

ఆడపడుచుల ఆత్మీయ వేడుక బతుకమ్మ. తీరొక్క పూలతో శిఖరంలా పేర్చి ఆడిపాడుతారు. ఈ సంబురం కోసం ఏడాదంతా ఎదురుచూస్తారు. అలాంటి ఉత్సవం రానే వచ్చింది. బుధవారం నుంచి బతుకమ్మ మొదలు కానుంది. తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా చేసుకుంటారు.



రోజుకో పేరుతో..

వినాయక చవితి నిమజ్జనం తర్వాత రోజు నుంచి చిన్నారులు బొడ్డెమ్మ ఆడతారు. తర్వాత పితృ అమవాస్య నాడు పేర్చే ఎంగిలిపూల బతుకమ్మతో అసలు సంబరాలు మొదలవుతాయి. తొమ్మిది రోజుల పాటు రోజుకో పేరుతో పేరుస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నాన బియ్యం, ఐదో రోజున అట్ల, ఆరోరోజు అలిగిన, ఏడో రోజు వేపకాయల, ఎనిమిదో నాడు వెన్నముద్దల, తొమ్మిదోనాడు సద్దుల బతుకమ్మగా కొలుస్తారు. ఇందులో పూలదే కీలకపాత్ర. గునుగ, తంగేడు, గన్నేరు, పోక బంతి, బీర, గుమ్మడి, బంతి, చామంతి, తామర తదితర పూలు ఉపయోగిస్తారు. పైన తమలపాకులో పసుపుముద్దను గౌరమ్మగా ఉంచి మంగళహారతులు సమర్పిస్తారు. ఒక్కో పువ్వు ఒక్కో విశిష్టత ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ఆరోగ్యం, సిరిసంపదలు సమకూరుతాయని నమ్ముతారు. నిజామాబాద్ నగరంలో వీక్లీబజార్, పెద్దబజార్, సుభాష్‌నగర్, వినాయక్ నగర్, ఆర్మూర్, బోధన్‌లో ఇప్పటికే సందడి నెలకొంది.

పాటల్లో అనుబంధాలు

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలను గుర్తుచేస్తూ ఆడపడుచులు వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడుతూ ఆటలు ఆడుతారు. గారెలు, అప్పాలు, వడలు, అట్లు, పూరీలు, అటుకులు, పులిహోరా, పెరుగన్నం నైవేద్యంగా తయారుచేస్తారు. చివరగా.. సమీప చెరువులు, కుంటలు, వాగులు, నదుల్లో పోయి రావమ్మా బతుకమ్మ.. మళ్లొచ్చే ఏడాది మళ్లీ రావమ్మా! అంటూ వీడ్కోలు పలుకుతారు. వెంట తెచ్చుకున్న సద్దులు ఆత్మీయంగా ఆరగిస్తారు.

ఇక్కడ ప్రత్యేకం

బోధన్‌లో మూడు రోజులకే సద్దుల బతుకమ్మ ఆడుతారు. ఎడపల్లిలో దసరా తర్వాతి రోజున ఆడడం ఆనవాయితీ. బోర్గాం(పి)లో ప్రతి ఇంటి నుంచి కుటుంబ సభ్యులంతా వేడుకల్లో పాల్గొంటారు. విదేశాల్లో స్థిరపడిన జిల్లా వాసులు సైతం స్థానికంగా వేడుకలు నిర్వహిస్తుంటారు.



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



మంత్రి నోట.. ఇంజినీరింగ్ కళాశాల మాట

ఏళ్లనాటి డిమాండ్‌పై స్పందించిన జూపల్లి

.. వివరాలు 8లో



నిజామాబాద్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

దసరాకు 482 ప్రత్యేక బస్సులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 482 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ నుంచి జేబీఎస్‌కు, జేబీఎస్ నుంచి నిజామాబాద్‌కు ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీసు ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ ప్రణాళిక ప్రకారం నడుస్తాయన్నారు. రీజియన్ పరిధిలోని నిజామాబాద్- 1, 2, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి జేబీఎస్‌కు వరకు నడుపుతున్నట్లు తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు www.tsrtconline.in వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా ఇబ్బందులుంటే ఫోన్ చేయాలని సూచించారు.

- ఆర్మూర్ – 73828 43133
- బోధన్ – 98495 00725
- నిజామాబాద్ – 99592 26022
- బాన్సువాడ – 94911 05706
- కామారెడ్డి – 84682 20281

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు చరవాణి/ఈ-మెయిల్‌కి వెరిఫికేషన్ మెసేజ్ వస్తుందని, సమాచారం వచ్చిన వారే బుధవారం నుంచి 5వ తేదీ వరకు జిల్లాకేంద్రం నిర్మల హృదయ పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు హాజరుకావాలని డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నిజ ధ్రువపత్రాలతో పాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన రెండు సెట్ల జిరాక్సులు తెచ్చుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ ఫారం డౌన్లోడ్ చేసుకొని వివరాలు నింపాలని సూచించారు. మంగళవారం సాయంత్రమైనా రాష్ట్ర విద్యాశాఖ నుంచి మెరిట్ జాబితాలు రాకపోవడంతో ధ్రువపత్రాల పరిశీలన చేయలేదని, రాత్రి వరకు వచ్చే అవకాశం ఉందన్నారు.

'భాజపాతోనే సుపరిపాలన సాధ్యం'



కామారెడ్డిలో సభావేదికపై నుంచి నమస్కరిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, చిత్రంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: భాజపాతోనే సుపరిపాలన సాధ్యమని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. కామారెడ్డి ఆర్టీసీ ప్రాంగణంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు చౌరస్తా, జేపీఎన్ రోడ్డులో పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించారు. రాజారెడ్డి గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల సభ్యత్వాలు నమోదయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రధాని మోదీ శక్తివంతమైన నాయకుడన్నారు. ఆయన ఉన్న పార్టీలో అదే స్థాయిలో సభ్యత్వాలు చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇప్పటికే ఏడు కోట్లు పూర్తయ్యాయన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే స్థాయి నాయకులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పదేళ్లు పాలించిన భారాస, మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు హామీల అమల్లో నిర్లక్ష్యం చేశాయని ఎద్దేవా చేశారు. ప్రతి బూత్ పరిధిలో గత పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కన్నా ఎక్కువ సభ్యత్వాలు చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, నేతలు మురళీధర్‌గౌడ్, ఆలె భాస్కర్, నీలం చిన్నరాజులు, రణజిత్ మోహన్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, విపుల్ పాల్గొన్నారు.

పండగ పూట కబురు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

నిధుల కొరతతో పల్లెల్లో పాలన పడకేసింది. ఎనిమిది నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు లేవు. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్‌సీ కింద జిల్లాకు రూ.9 కోట్లు విడుదలయ్యాయి. వీటిని విద్యుత్తు బిల్లులు, ట్రాక్టర్ వాయిదాలకు వెచ్చించొచ్చు. రెండు రోజుల్లో పంచాయతీల ఖాతాల్లో జమకానున్నాయి.

కార్యదర్శులే సొంతంగా ఖర్చు..

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో ఏ పని కావాలన్నా పంచాయతీ కార్యదర్శులే ముందుండి నడిపించాల్సిన వస్తోంది. ఏడాదిగా ఎస్ఎఫ్‌సీ నిధులు రాలేవు. ఇటీవల గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించగా.. చిల్లి గవ్వ ఇవ్వలేదు. చాలాచోట్ల పంచాయతీ కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ కొనుగోలు, వీధి దీపాలు, బ్లీచింగ్, సింగిల్ ఫేస్ మోటారు అమర్చడం, పారిశుద్ధ్య కార్మికులకు కొంతలో కొంత వేతనాలు ఇవ్వడం కోసం జేబుల్లో నుంచి వెచ్చించారు. ఎట్టకేలకు నిధుల రాకతో ఊపిరి పీల్చుకున్నారు.



పంచాయతీలు: 530
పారిశుద్ధ్య కార్మికులు: 2,915
విడుదలైన నిధులు: రూ.9 కోట్లు

8 వరకు సర్వే పూర్తి చేయాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి 3వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా చేపట్టే సర్వే 8 నాటికి పూర్తిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండు గ్రామాలు ఎంపిక చేసి సర్వే చేపట్టాలన్నారు. ఫొటో కోసం ఒత్తిడి చేయొద్దని, కుటుంబ సభ్యుల అంగీకారం మేరకే తీసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లను దసరా కానుకగా అర్హులకు కేటాయించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. 15వ తేదీ వరకు ప్రతి మండలంలో ఒక కొనుగోలు కేంద్రం ప్రారంభించాలన్నారు.

భారాసది బురదజల్లే ప్రయత్నం: సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలను విస్మరించిన భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌తో కలిసి మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి సైట్‌లో వివరాలు తప్పుగా ఉండటంతో కొందరికి రుణమాఫీ కాలేదని, వాటిని అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు. హైడ్రా విషయంలో భారాస నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఏ ఒక్క పేద ఇంటిని కూల్చలేదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఈ నెల 4న వస్తున్నందున పాత కలెక్టరేట్ మైదానంలో బహిరంగ సభ ఉంటుందని, జయప్రదం చేయాలన్నారు. నాయకులు నగేష్‌రెడ్డి, అరికెల, సునీల్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్ ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో మానాల మోహన్‌రెడ్డి, తాహెర్, గడుగు తదితరులు

కోతకొచ్చిన పంట.. కొనుగోళ్లకు తంటా

సోయా, మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటుపై నిర్లిప్తత

న్యూస్‌టుడే, ఆర్మూర్

జిల్లాలో మొక్కజొన్న, సోయాబీన్ కోతలు మొదలయ్యాయి. ఈ ఏడాది ఆశించినస్థాయిలో పంట చేతికందడం, మార్కెట్‌లోనూ మంచి ధర లుండడంతో పడిన కష్టానికి ఫలితం దక్కుతుందనే భరోసాలో అన్నదాతలున్నారు. కానీ పంట మార్కెట్‌కు వస్తుందనే తరుణంలో వ్యాపారులు ధరలు తగ్గిస్తారనే భయం ప్రస్తుతం రైతులను వెంటాడుతోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే మేలు జరుగుతుందని కోరుతున్నారు. అయితే ఇప్పటివరకు ఎక్కడ? ఎన్ని? కేంద్రాలు పెట్టాలనే దానిపై అధికారుల నుంచి స్పష్టత లేదు.



అల్పపీడన ప్రభావంతో భయం

సోయాబీన్‌కు మద్దతు ధర క్వింటాకు రూ.4,892 ఉంది. ప్రస్తుతం బహిరంగ విపణిలో రూ.3,800 నుంచి రూ.4,500 ధర పలుకుతోంది. ఈపాటికే చాలా చోట్ల కోతలు మొదలయ్యాయి. పంట ప్రస్తుతం కల్లాలు దాటనప్పటికీ అల్పపీడన ప్రభావంతో కొనుగోలు కేంద్రాలుంటే తక్షణమే విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

పంట	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (క్వి)
మొక్కజొన్న	52,762	13.20 లక్షలు
సోయాబీన్	36,418	2.54 లక్షలు

త్వరలో ప్రారంభిస్తాం

- రంజిత్‌రెడ్డి, మేనేజర్, మార్క్‌ఫెడ్

సోయాబీన్, మొక్కజొన్న కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తాం. ఎక్కడెక్కడ ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలనే దానిపై కార్యాచరణ తయారు చేస్తున్నాం.

మంత్రి నోట.. ఇంజినీరింగ్ కళాశాల మాట

ఏళ్లనాటి డిమాండ్‌పై స్పందించిన జూపల్లి

ఈనాడు, నిజామాబాద్



ఇందూరులో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అంశం మరోమారు తెరపైకి వచ్చింది. జిల్లాలో సోమవారం విస్తృతంగా పర్యటించిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఈ అంశంపై మాట్లాడారు. ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాలను ఉన్నతీకరించబోతున్నట్లు చెప్పారు. తెలంగాణ వర్సిటీలోనూ ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరుతూ వెళ్లిన ప్రతిపాదన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ వ్యాఖ్యలు.. జిల్లాలో ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తెచ్చే విషయంలో సానుకూలతను చాటాయి. ఈ ఏడాది నుంచే కోర్సుల ప్రారంభానికి అనుకూలంగా ఉన్నప్పటికీ అనుమతులు సాధించుకోలేకపోవటం విద్యార్థులకు నష్టం చేసిందనే అభిప్రాయాన్ని విద్యార్థి సంఘ నేతలు వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ ఉన్నా.. ఆలస్యంగానే !

గత ఏడాది ఖమ్మం, మహబూబాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు ఉత్తర్వులిచ్చారు. ఎలాంటి మౌలిక వసతులు లేనప్పటికీ.. అదే ఏడాది ఆలస్యంగా ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సైతం నిర్వహించి సెప్టెంబరు వరకు ప్రక్రియ కొనసాగించారు. ఖాళీగా ఉండే ప్రభుత్వ శాఖల భవనాల్లో తాత్కాలికంగా తరగతులను ప్రారంభించేశారు. నిజామాబాద్ జిల్లా విషయానికొచ్చే సరికి.. మౌలికసదుపాయాల పరంగా ఇబ్బంది లేదు. వెంటనే తొలి ఏడాది తరగతుల నిర్వహణకు సౌకర్యాలు ఉన్నాయి. గదులు, బోధన సిబ్బంది, కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయి. అయినా ఆ దిశగా అడుగులు పడలేదు.



కోస్గిలో ఆగమేఘాలపై...

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నతీకరించే ఆలోచనను గత డిసెంబరు ఆఖరులోనే ప్రభుత్వం చేసింది. జనవరిలో ఈ అంశంపై నివేదికలు తెప్పించుకుంది. పది కళాశాలలను ఇందుకు ఎంపిక చేయటం.. అందులో నిజామాబాద్ కళాశాల ఉండటం విదితమే. ఫిబ్రవరి చివర్లో కేవలం కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఉన్నతీకరిస్తూ మాత్రమే ఉత్తర్వులొచ్చాయి. జులైలో కౌన్సెలింగ్ జరిపి సీట్లు భర్తీ చేశారు. మిగతా జిల్లాల్లో ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాలలు ఉండటంతో అక్కడి అధికారులు, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు ఈ అంశానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. అసలు ఇంజినీరింగ్ కళాశాల లేని నిజామాబాద్ జిల్లా విషయంలో పరిస్థితి వేరు. ఇక్కడి ప్రతినిధులు సకాలంలో దృష్టి సారించి.. ప్రభుత్వ స్థాయిలో ఒత్తిడి తీసుకొని వచ్చి ఉంటే ఇప్పటికే ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులోకి వచ్చి ఉండేవని విద్యావంతులు పేర్కొంటున్నారు.

ఆచరణలో ఎప్పుడో..!

ప్రస్తుత ముఖ్యమంత్రి, నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో జిల్లాలో పర్యటించినప్పుడు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయ్యాక లోక్‌సభ ఎన్నికల సభలో పాల్గొన్నప్పుడు మరోసారి ప్రస్తావించారు. ఈ విద్యా సంవత్సరంలో వెళ్లిన రెండు రకాల ప్రతిపాదనలు.. అనుమతుల వరకు చేరుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయంలో భాగంగా ఇక్కడి పాలిటెక్నిక్ కళాశాల ఉన్నతీకరణ అయినా.. వెంటనే చేసేందుకు అవకాశం ఉన్నా.. ఇక్కడి నేతలు ఉత్తర్వులు సాధించటంలో సఫలం కాలేదు.



క్రీడాకారులతో నిర్వాహకులు

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్-14 బాలుర జట్టును నిర్వాహకులు మంగళవారం ఎంపిక చేశారు. గ్రామీణ మండలం సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వందమంది క్రీడాకారులు పాల్గొన్నారని పీడీ రంగు కృష్ణంరాజు పేర్కొన్నారు. డిసెంబరు 6వ తేదీన గద్వాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, పీడీలు శ్రీధర్, నాగరాజు, విజేష్ ఉన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ ప్రాథమిక పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్, నారాయణపేట్ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠనాసక్తిని ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను చూశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలని సూచించారు. బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించారు.



అర్గుల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

రాగిజావ.. విద్యార్థికి చేవ

అంగన్‌వాడీల్లో పంపిణీకి ఏర్పాట్లు



న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి(నిజామాబాద్)

అంగన్‌వాడీల్లో రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే అన్నపూర్ణ ట్రస్టు ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. కేంద్రాల్లో పోషకాహారం అందిస్తున్నా దానికి తోడుగా ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల మెరుగుపడుతుందని భావిస్తోంది. జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ ప్రాజెక్టుల పరిధిలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 3 నుంచి ఆరేళ్ల వయసున్న చిన్నారులు 54,170 మంది, గర్భిణులు 12,670, బాలింతలు 8,205 నమోదై ఉన్నారు. చిన్నారులు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు కావాల్సిన పోషకాలు ఇందులో ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.



ఒకపూట సంపూర్ణ భోజనంలోని పదార్థాలు

బాలింతలు, గర్భిణులు	
బియ్యం	150గ్రాములు
కందిపప్పు	30 గ్రాములు
నూనె	16 గ్రాములు
పాలు	200 మి.లీ.
ఒక గుడ్డు	

పిల్లలకు..	
బియ్యం	75 గ్రాములు
కందిపప్పు	15 గ్రాములు
నూనె	5గ్రాములు
ఒక గుడ్డు	

ఇందులో ఏముంటాయంటే?

- 100 గ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీ గ్రాములు, సోడియం 11 మి.గ్రా, కాల్షియం 344 మి.గ్రా., పోటాషియం 408 మి.గ్రా. ఉంటాయి.
- పిల్లల ఎముకలు దృఢంగా మారడానికి కావాల్సిన కాల్షియం అందుతుంది.
- కాల్షియం, ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇనుము మోతాదు ఎక్కువగా ఉండటంతో రక్తహీనత తగ్గిస్తుంది.
- 'సీ' విటమిన్ వల్ల రోగనిరోధక శక్తిని పెరుగుతుంది. మాంసకృతులూ ఎక్కుగా ఉంటాయి.
- కండరాల ఆరోగ్యంతో పాటు రక్తం తయారు కావడానికి దోహదపడుతుంది.



నిండుకుండలా జలాశయం

నిజాంసాగర్ వరద గేట్లు మూసివేత

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద రాక తగ్గిపోవడంతో ప్రధాన వరద గేట్ల నుంచి నీటి విడుదల నిలిపివేసినట్లు జలవనరుల శాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రానికి సాగర్‌లోకి 4200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉండటంతో వరద గేట్లు పూర్తిగా మూసివేశామన్నారు. జలవిద్యుదుత్పత్తి కేంద్రం నుంచి వానాకాలం పంటల సాగు కోసం 2000 క్యూసెక్కులు సాగర్ ప్రధాన కాలువలోకి విడుదల కొనసాగుతోందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.92 అడుగులు (17.687 టీఎంసీలు) నిల్వ ఉందని పేర్కొన్నారు.

వర్సిటీలోని సమస్యలు పరిష్కరించాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరికి మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. వసతి గృహాల్లో ఫ్యాన్లు బిగించాలని, పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కల్ని తొలగించాలని, రాత్రి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. తాగునీరు ఫిల్టర్ కావడంలేదని, సంబంధిత సిబ్బందితో నీటి పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌యూఐ వర్సిటీ అధ్యక్షుడు సాగర్ నాయక్, ఉపాధ్యక్షులు హరీష్, సందీప్, రాజేంద్ర ప్రసాద్, నాయకులు చందర్ తదితరులున్నారు.



రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరికి వినతిపత్రం ఇస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

డీఎస్సీలో వీరు ప్రత్యేకం

న్యూస్‌టుడే, డిచ్‌పల్లి, భిక్కనూరు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన అన్నదమ్ములు, భార్యాభర్త మంచి ర్యాంకులు సాధించి ప్రత్యేకంగా నిలిచారు.

అన్నదమ్ములు అదుర్స్..

డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన ఏరా సుజాత-రాంచందర్ దంపతుల ఇద్దరు కుమారులు రణేందర్, రాకేశ్ సత్తాచాటారు. పెద్ద కుమారుడు రణేందర్‌కు 2022లో కోర్టులో ప్రాసెస్ సర్వర్ ఉద్యోగం వచ్చింది. అందులో చేరిన నెల రోజులకే ఆర్‌ఆర్‌బీలో గ్రూప్-2 ఉద్యోగం వరించింది. అయినప్పటికీ కోర్టు ఉద్యోగాన్నే కొనసాగిస్తున్నారు. సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో రణేందర్ ఎస్జీటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈయన తమ్ముడు రాకేశ్ వ్యాయామ విద్య (పీఈటీ, పీడీ) విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించడం గమనార్హం. ఇలా అన్నదమ్ములు ఇద్దరూ డీఎస్సీలో ప్రతిభ చాటడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు.



అన్నదమ్ములు ఏరా రణేందర్, రాకేశ్



శ్యామ్‌రాజ్, అరుణ

ప్రత్యేక విద్యావిభాగంలో..

భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డికి చెందిన శ్యామ్‌రాజ్ ఎస్జీటీ ప్రత్యేక విద్యావిభాగంలో కామారెడ్డి జిల్లా 4వ ర్యాంకు సాధించగా.. ఆయన భార్య అరుణ ఎస్జీటీ ప్రత్యేక విద్యావిభాగంలో మెదక్ జిల్లాలో 5వ ర్యాంకు పొందడం విశేషం. ఒకే డీఎస్సీలో దంపతులిద్దరూ ప్రతిభ చాటడంతో స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.

కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలంగాణ సామాజిక రచయితల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ నేతృత్వంలో ముద్రించిన జల సంరక్షణ సందేశం - జల నినాదాలు కరపత్రాలను మంగళవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆవిష్కరించారు. యుగంధర్ రంగరాథ్, వేముల శేఖర్ తదితరులున్నారు.

3న ఫుట్‌బాల్ ఎంపికలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని రాజారాం స్టేడియంలో 3న ఉదయం 10 గంటలకు అండర్-19 బాలుర ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహించనున్నామని డీఐఈవో రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ ఎంపికలకు అర్హులని, వివరాలకు పీడీ ప్రసాద్ చరవాణి నంబరు 94416 31631లో సంప్రదించాలన్నారు.





సెలవు.. విద్యార్థి ముఖం వెలుగు

రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈ నెల 14 వరకు దసరా సెలవులు ప్రకటించింది. నాలుగు నెలల తర్వాత వచ్చిన విరామం కావడంతో విద్యార్థుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. ఎవరి ముఖం చూసినా వెలుగులు కనిపించాయి. జిల్లా కేంద్రంలో చదువుతున్న తమ పిల్లల్ని తీసుకెళ్లేందుకు తల్లిదండ్రుల రాకతో నిజామాబాద్ ప్రధాన బస్టాండు కిటకిటలాడింది. బస్సుల్లో సీట్లు దక్కించుకునేందుకు పోటీపడ్డారు. ఏ బస్సు చూసినా కిక్కిరిసి కనిపించింది.

- ఈనాడు, నిజామాబాద్,



సమన్వయంతో ఉత్తమ ఫలితాలు

ఇందూరు సిటీ, న్యూస్‌టుడే: రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమన్వయం ఉంటే అనుకున్న ఫలితాలు సాధించొచ్చని జిల్లా జడ్జి కుంచాల సునీత పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్‌లో లోక్ అదాలత్ విజయవంతం నేపథ్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వినాయక ఉత్సవాల బందోబస్తులో తీరిక లేకుండా ఉన్నా.. లోక్ అదాలత్ విజయవంతానికి పోలీసు శాఖ ఎంతో శ్రమించిందన్నారు. 12 వేల క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పరిష్కారంలో క్రియాశీలకంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచినట్లు తెలిపారు. పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కుంచాల సునీత, సీపీ కల్మేశ్వర్, అదనపు డీసీపీలు కోటేశ్వర్‌రావు, శంకర్ నాయక్



కొత్త హౌసింగ్‌బోర్డు ఉపకేంద్రంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యం

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నగర వాసులకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే తమ లక్ష్యమని టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రం డీ-5 సెక్షన్ పరిధిలోని న్యూ హౌసింగ్ బోర్డు ఉపకేంద్రంలో మంగళవారం 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి అనంతరం మాట్లాడారు. డీఈలు శ్రీనివాసరావు, రాజేశ్వర్‌రావు, ఏడీఈ తోట రాజశేఖర్, ఏఈ అసరుద్దీన్ తదితరులున్నారు.

వృద్ధులు చట్టాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: వయో వృద్ధుల సంరక్షణ కోసం తీసుకొచ్చిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ నీతూకిరణ్ పేర్కొన్నారు. మంగళవారం నూతన అంబేడ్కర్ భవనంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. అంతకుముందు పాత కలెక్టరేట్ మైదానం నుంచి ర్యాలీని జిల్లా జడ్జి కుంచాల సునీత జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్ సిటిజన్లను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పించడం సరికాదన్నారు. పాత మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న వెల్‌నెస్ కేంద్రంలో అదనపు సౌకర్యాలు కల్పించాలని మేయర్‌ను కోరారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను సన్మానించారు. మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, వైద్యురాలు జయసీనెహ్రూ, ఇన్‌ఛార్జి అర్బన్ సీడీపీవో నందిని, రామ్మోహన్‌రావు, రవీందర్, ఆంజనేయులు, రాజేశ్వర్, గంగాధర్, అశోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం గ్రహీతలతో మేయర్ నీతూకిరణ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

డిప్యుటేషన్ రద్దు

రెంజల్, న్యూస్‌టుడే: రెంజల్ మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి డిప్యుటేషన్‌ను రద్దు చేస్తూ జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్‌హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏవో అక్రమాలకు పాల్పడుతూ తమను వేధింపులకు గురి చేస్తున్నారంటూ రెంజల్ మండల పురుగు మందుల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం పాలనాధికారి, డీఏవో, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆరేళ్లుగా రెంజల్ ఏవోగా పని చేస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డి డిప్యుటేషన్ రద్దు చేస్తూ బోధన్ వ్యవసాయశాఖ టెక్నికల్ ఏవోగా బదిలీ చేశారు. ఎడపల్లి ఏవో సిద్దిరామేశ్వర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



బోర్గాం(పి)(మోపాల్): బోర్గాం(పి)లోని సాయిగంగా వృద్ధాశ్రమంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, ఉదయసూర్యభగవాన్ పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో రోటరీక్లబ్ నిజామాబాద్ అధ్యక్షుడు విజయరావు ఆధ్వర్యంలో కుర్చీలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



సమస్య : బోధన్ చెక్కి క్యాంపు కాలనీలో మురుగు కాల్వ శుభ్రం చేయించాలి. **- సాయిలు, బోధన్**

సమస్య : బోధన్ పోస్టాఫీసు వెనుక కాలనీలోని రహదారిపై వేసిన వ్యర్థాలు తొలగించాలి. **- ఫారుఖ్, బోధన్**

పరిష్కారం : ఈ రెండు సమస్యలను సంబంధిత శానిటరీ జవాన్లు గాబ్రియెల్, గంగారాం దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది కాల్వ శుభ్రం చేయించి, చెత్త తొలగింపచేయించి సమస్యలు పరిష్కరించారు.

సమస్య: దుబ్బ ప్రాంతంలో కుక్కలు గుంపు గుంపులుగా తిరుగుతున్నాయి. **- శ్రీనివాస్, దుబ్బ**



సమాధానం: వాటిని అరికట్టేందుకు ప్రత్యేక బృందం మీ కాలనీకి పంపిస్తాం. **- నటరాజ్‌గౌడ్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, నగరపాలక సంస్థ**

సమస్య: శ్రీనగర్ కాలనీ రోడ్ నెం.3లో కొన్ని స్తంభాలు వంగిపోయాయి. సీసీ రోడ్డు వేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. **- సుధాకర్‌రావు, శ్రీనగర్ కాలనీ**

పరిష్కారం : కాలనీలో సమస్యలు ఉన్నది వాస్తవమే. జీవీల్ ఇక్కడికి వచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి ప్రయత్నం చేస్తాం. **- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: గంగాస్థాన్ ఫేజ్-1లో మురుగు నిలిచింది. ఇప్పటి వరకు బ్లీచింగ్ పౌడర్ వేయలేదు. **- వెంకటేశ్వర్, గంగాస్థాన్**

పరిష్కారం : త్వరలోనే చర్యలు చేపడతాం. **- షాదుల్లా, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం, బోధన్, ధర్పల్లి, నిజామాబాద్ అర్బన్

పనుల్లో జాప్యం.. విద్యార్థులకు అసౌకర్యం

☛ మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం

బడుల్లో మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ పనుల తీరుపై బోధన్ నియోజకవర్గంలోని పాఠశాలల్లో 'న్యూస్‌టుడే' పరిశీలన చేపట్టింది. పాఠశాలల పనుల్లో జాప్యం నెలకొంది. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. కనీసం సెలవులు పూర్తయ్యేలోగానైనా పనులు పూర్తి చేయిస్తే మేలు. నియోజకవర్గంలోని నవీపేట, బోధన్ పట్టణం, మండలం, రెంజల్ మండలాల్లో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, బోధన్

- ● బడి పేరు
- ★ గ్రామం/కాలనీ
- ✤ విద్యార్థుల సంఖ్య
- ❑ మంజూరైన నిధులు
- ◆ చేపట్టాల్సిన పనులు
- ■ ప్రస్తుత పరిస్థితి

● ప్రాథమిక పాఠశాల
★ బోధన్ అంబేడ్కర్ కాలనీ
✤ 20 ❑ రూ. 8.50లక్షలు
◆ తాగునీరు, మరమ్మతులు, విద్యుదీకరణ
■ ఈ పాఠశాల భవనం సరిగా లేకపోవడంతో బడిని సమీప పాఠశాలలోని అదనపు గదుల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ పనులేవీ చేపట్టకుండానే నిధులు తిప్పి పంపిస్తున్నారు. నూతన భవనం కోసం ప్రతిపాదించాల్సి ఉంది.

న్యూస్‌టుడే, బోధన్



బోధన్ అంబేడ్కర్ నగర్ కాలనీలోని బడి

● ప్రాథమిక పాఠశాల
★ బర్దీపూర్
✤ 50
❑ రూ. 3.60లక్షలు
◆ మార్బుల్ టయిల్స్ ఏర్పాటు, తరగతి గదుల స్లాబుపై మరమ్మతులు, తాగునీటి శుద్ధజల యంత్రం ఏర్పాటు, భవన స్లాబు వర్షాకాలం చెమ్మతో నీళ్లు గదిలో పడుతున్నాయి. దానికి సంబంధించిన మరమ్మతులు చేయాలి. అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారుల అలసత్వంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి.

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న శుద్ధ జల యంత్రం

● శివాలయ ప్రాంత ప్రాథమిక పాఠశాల
★ రెంజల్
✤ 40
❑ రూ. 3లక్షలు
◆ మరుగుదొడ్లు, మూత్రశాలలకు తలుపుల బిగింపు, మూత్రశాలలకు నీటి కనెక్షన్, కుళాయిల ఏర్పాటు, తరగతి గదులకు రంగులు వేయడం
■ మండలంలోని అధిక పాఠశాలల్లో పనులను ఒకే గుత్తేదారు దక్కించుకోవడంతో సకాలంలో పనులు పూర్తికావడం లేదు. అధికారులు, పాలకుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదారు నత్తనడకన పనులు చేపడుతున్నారు. ఏ ఒక్క పాఠశాలలో సకాలంలో పనులు పూర్తి చేయడం లేదు.

న్యూస్‌టుడే, రెంజల్



మరమ్మతులకు నోచుకోని మూత్రశాల తలుపులు

● జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల
★ నవీపేట
✤ 297
❑ రూ. 24 లక్షలు
◆ తరగతి గదుల్లో కొత్తగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసి, దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. తరగతి గది లోపల పెచ్చులూడిన స్లాబులకు, గదుల్లో ధ్వంసమైన ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది. పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో నత్తనడకన సాగుతున్నాయనే విమర్శలున్నాయి. పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.

న్యూస్‌టుడే, నవీపేట



తరగతి గదిలో ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టక ఇలా.

తప్పెవరు చేసినా శిక్షార్హులే

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఎవరు తప్పు చేసినా శిక్షార్హులేనని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ అన్నారు. రెండు రోజులుగా సిబ్బంది మధ్య అంతర్యుద్ధంపై మంగళవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రెంజల్ మండల వ్యవసాయాధికారి ఆరోపణలు ఖండించారు. మూడు, నాలుగేళ్ల కిందటి ఉదంతాలు ప్రస్తావిస్తూ అవినీతి జరిగిందనడం సరికాదన్నారు. బోధన్ మండలం భూలక్ష్మి క్యాంపులోని దుకాణంతో పాటు రెంజల్ మండలం కల్యాపూర్‌లోని పురుగు మందుల దుకాణంపై చర్యలు తీసుకోవాలని ఏవో సూచించారని, సంబంధిత డీలర్‌పై కేసునమోదు చేసిన ఆధారాలున్నాయన్నారు. రెంజల్ సహకార సంఘంలో ఎరువుల నిల్వలు జప్తు చేస్తే కలెక్టర్ విచారణ చేసి రూ.53,330 జరిమానా వేశారన్నారు.

ఏఈవోలు గైర్హాజరు : డిజిటల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించని వారికి గైర్హాజరు పడుతుందని డీఏవో స్పష్టం చేశారు. విస్తరణాధికారు(ఏఈవో)లపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది ప్రభుత్వమే నిర్ణయిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఏఈవోలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. తామంతా విధుల్లో కొనసాగుతున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్, గౌరవ అధ్యక్షుడు రాజునాయక్ తెలిపారు. రాష్ట్ర కమిటీ సూచనలకు కట్టుబడి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 80 శాతం మొక్కజొన్న, సోయా కోతలు పూర్తవగా, 25 శాతం మేర వరి నూర్పిడి పూర్తయిందని, ఇప్పటికిప్పుడు సర్వే ప్రారంభించినా సగం విస్తీర్ణం ఖాళీగానే వదిలేయాల్సిన పరిస్థితి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'ఏవోపై చర్యలు తీసుకోండి'

రెంజల్ : ఎరువులు, పురుగుమందుల విక్రయ యజమానులను తరచూ వేధిస్తూ వసూళ్లకు పాల్పడిన రెంజల్ ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మండల ఎరువులు, పురుగుమందుల విక్రయ యాజమాన్య అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. బోర్గాంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతినిధులు కార్తీక్, ఆమేర్‌బేగ్, శివకుమార్, రమేష్, మోహన్‌రెడ్డి, సతీష్ ఉన్నారు.

దేవీమాత మండపాలకు పట్టుచీరలు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్‌గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్వాడీగల్లీలోని కార్యాలయంలో దేవీమాత మండపాలకు మంగళవారం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పట్టుచీరలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ... 11 ఏళ్లుగా సుమారు 250 మండపాలకు ట్రస్ట్ ద్వారా చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ధర్మరక్షణ, హిందూ సంప్రదాయాలను పెంపొందించే ప్రతి కార్యక్రమానికి ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ట్రస్ట్ సభ్యులు, భాజపా నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పట్టుచీరలు అందిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పింఛన్లొచ్చాయని.. చుట్టుముట్టి



పింఛను ఇస్తున్నట్లు సమాచారం అందడంతో వృద్ధులు ఇలా పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆగస్టు నెలకు సంబంధించిన డబ్బులు మంగళవారం ఇస్తున్నారని ధర్పల్లి మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం చుట్టుముట్టారు. సెప్టెంబరువి ఇంకా రాలేదని వారు నిట్టూరుస్తూ చెప్పారు. **- ఈనాడు, నిజామాబాద్**

బతుకమ్మ సంబరాలు



బోధన్ : శ్రీవిజయసాయి బడిలో..



ధర్పల్లిలో..



బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్‌లో..



కాలూరు ఉన్నత పాఠశాలలో..



బోర్గాం(పి) సాహితీ విద్యానికేతన్‌లో..



విశ్వభారతి విద్యాలయంలో..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు బడులతో పాటు వివిధ ప్రాంతాల్లో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బుధవారం నుంచి దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలలకు హాజరయ్యారు. విద్యార్థినులు, మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడారు. ఉపాధ్యాయులు పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. **- న్యూస్‌టుడే బృందం**



కాకతీయ ఒలింపియాడ్ పాఠశాలలో..



రెంజల్‌లో..



ఏఆర్పీక్యాంపులో..



సిరికొండలో..



సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాలలో..



శ్రీపద్మశాలీ పాఠశాలలో..



కోటగిరిలో.. జూనియర్ కళాశాల విద్యార్థినులు



బోధన్ ఆజాంగంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



నవీపేటలో..



బోధన్ గ్రామీణం : సాలూరలోని వాగ్దేవి బడిలో..



సాలూరలో...

రైతులకు అండగా ప్రభుత్వం

సాలూర, న్యూస్‌టుడే : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని రైతులను కోరారు. బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్‌మహతోతో కలిసి మంగళవారం సాలూర, హున్సా, మందర్న, ఖాజాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి సోయా, వరి పంటలు పరిశీలించారు. రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమఅవుతాయన్నారు. అనంతరం సాలూరకు చెందిన గగన్ డీఎస్సీ ఫలితాలలో ప్రతిభ చాటడంతో ఆయనను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, తాహెర్ బిన్ హందాన్, జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్, నాయకులు గంగాశంకర్, జనార్దన్, రమేష్, నాగరాజు, రాజ్‌గౌడ్, రవి, అశోక్ పాల్గొన్నారు.



సోయాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఆర్‌యూబీ నిర్మాణానికి స్థల పరిశీలన

డిచ్‌పల్లి గ్రామీణం, ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: డిచ్‌పల్లి - ఘన్‌పూర్ మధ్య ఉన్న రైల్వేగేటు వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి రైల్వే, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పోలీసు అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. భవిష్యత్తులో రైళ్ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గతేడాది నడిపల్లి పంచాయతీ పాలకవర్గం ఆర్‌యూబీ కోసం తీర్మానం చేయగా.. తాజాగా అధికారులు స్థల పరిశీలనకు వచ్చారు. ఇందల్‌వాయి - ధర్పల్లి మార్గంలోనూ తిర్మన్‌పల్లి గేటు, గన్నారం - సిర్నాపల్లి రైల్వేగేటు వద్ద ఆర్వోబీ/ఆర్‌యూబీ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించినట్లు తహసీల్దార్ వెంకట్రావ్ తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

బోధన్ గ్రామీణం : బోధన్‌కు చెందిన మల్లయ్య (52) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కూలీ పని చేసుకుంటూ జీవించే మల్లయ్య ఆటోనగర్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబీకులు ఊరికి వెళ్లడంతో మూడు రోజుల కిందట పంఖాకు ఉరేసుకున్నారు. మంగళవారం పక్కింటి వాళ్లకు దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా మృతదేహం కుళ్లిపోయివేలాడుతోంది. అతని మృతికిగల కారణాలు తెలియరాలేదు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

నిజామాబాద్ నేరవిభాగం: నగరానికి చెందిన మునీర్, అఫ్రోజ్‌ల వద్ద 100గ్రా గంజాయి దొరికినట్లు రెండో ఠాణా ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపారు. బర్కత్‌పురాకాలనీలో ఇద్దరు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

మహిళ అదృశ్యంపై కేసు

రుద్రూర్ : రుద్రూర్ మండలానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎసై సాయన్న తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... సదరు మహిళ గత నెల 30న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె భర్త మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో..

నిజామాబాద్ నేరవిభాగం : రైల్వేస్టేషన్‌లో ఒకరు అదృశ్యమైన కేసు నమోదైంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. పొతంగల్‌కు చెందిన సయ్యద్ మౌలానా(53) ఇటీవల భార్యతో కలిసి నెల్లూరు వెళ్లి మంగళవారం వేకువజామున నిజామాబాద్ స్టేషన్‌కు వచ్చారు. ఊరికి వెళ్లడానికి బస్సు లేకపోవడంతో అక్కడే నిద్రపోయారు. భార్యకు చెప్పకుండా భర్త బయటకు వెళ్లారు. అతను కనిపించకపోవడంతో ఆమె రైల్వే ఠాణాలో ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

విద్యుత్తు నియంత్రిక ధ్వంసం

బోధన్ గ్రామీణం : బెల్లాల్ శివారులోని ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న 25కేవీ విద్యుత్తు నియంత్రికను సోమవారం అర్ధరాత్రి దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగితీగలను చోరీ చేశారు. ఘటనపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు

అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి

కోనరావుపేట, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన అల్లెపు శ్రీనివాస్‌కు, నిజామాబాద్ జిల్లా గుండారం గ్రామానికి చెందిన జ్యోతి (23)తో 2021లో వివాహమైంది. ఏడాది పాటు కాపురం సవ్యంగా సాగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు మాన్విత, హిరణ్య ఉన్నారు. జ్యోతి ప్రస్తుతం రెండు నెలల గర్భిణి. భర్త తరచూ మద్యం తాగి వచ్చి గొడవ పడగా ఠాణాలో ఆమె ఫిర్యాదు చేసింది. పెద్దల సమక్షంలో మాట్లాడుకొన్నారు. అయినప్పటికీ భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా, మానసికంగా వేధించేవాడు. గత నెల 17న శ్రీనివాస్‌తో పాటు కుటుంబ సభ్యులు వేధించి కొట్టారని జ్యోతి తన అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు సర్ది చెప్పి మరుసటి రోజు అత్తగారింటికి పంపారు. మంగళవారం ఉదయం శ్రీనివాస్ ఫోన్ చేసి మీ కూతురు చనిపోయిందని చెప్పగా కుటుంబ సభ్యులంతా నిమ్మపల్లి వచ్చారు. జ్యోతి అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉంది. శరీరమంతా గాయాలున్నాయి. తన కూతురు మృతికి కారణమైన భర్త శ్రీనివాస్, మామ మల్లయ్య, ఆడపడుచు మల్లవ్వ, చిన్నత్త రామయ్య, తోటికోడలు వసంతపై చర్యలు తీసుకోవాలని తండ్రి ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబీకులు దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న ఉద్దేశంతో అంత్యక్రియలు ముగిసే వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గోశాల ఆవుల చోరీకి యత్నం

బోధన్ గ్రామీణం: బోధన్ శివాలయం సమీపంలోని గోశాల ఆవుల్ని సోమవారం దుండగులు అపహరించేందుకు యత్నించారు. కొన్ని ఆవులకు మత్తుమందు ఇచ్చి అపహరించేందుకు చూడగా నిర్వాహకులు, స్థానికులు గుర్తించి దుండగులను వెంబడించడంతో పారిపోయారు. ఘటనా స్థలిని పట్టణ సీఐ వెంకటనారాయణ పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

నిజామాబాద్ అర్బన్ : డీఆర్‌డీవో కార్యాలయంలో పర్యవేక్షకుడిగా పనిచేసిన నర్సింహులు పదవీ విరమణ పొందారు. కార్యాలయంలో మంగళవారం నర్సింహులు దంపతులను డీఆర్‌డీవో సాయాగౌడ్ సన్మానించారు.

కేజీబీవీ సిబ్బంది మధ్య వివాదం

నిజామాబాద్ విద్యావిభాగం: మాక్లూర్ కేజీబీవీలో కొంతకాలంగా సిబ్బంది మధ్య వివాదం తలెత్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో సమగ్ర విచారణ చేపట్టాలని డీఈవో దుర్గాప్రసాద్ జీసీడీవో భాగ్యలతను ఆదేశించినట్లు తెలిసింది. ఓ అధికారిణి విద్యార్థుల ముందే తమను దూషిస్తున్నట్లు సిబ్బంది ఉన్నతాధికారుల ఎదుట వాపోయినట్లు సమాచారం. జీసీడీవోని వివరణ కోరగా.. కొంత సమన్వయలోపం ఉందని, విచారణ కొనసాగుతుందని, నివేదిక డీఈవోకి అందజేస్తామని స్పష్టం చేశారు.

ద్విచక్రవాహనం చోరీ: నిందితుల రిమాండ్

బోధన్ గ్రామీణం: బోధన్‌లోని పాన్‌గల్లీకి చెందిన శంకర్ ద్విచక్రవాహనం ఆదివారం చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పాతబస్టాండు సమీపంలోని ఓ దుకాణం వద్ద వాహనాన్ని నిలిపి ఓ దుకాణంలోకి వెళ్లి వచ్చే సరికి వాహనాన్ని దుండగులు అపహరించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా అక్కడి సీసీఫుటేజీ ఆధారంగా ద్విచక్రవాహనం ఎత్తుకెళ్లింది పట్టణానికి చెందిన గౌస్, హబ్బులుగా గుర్తించి వారిని పట్టుకున్నారు. మంగళవారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ



పీహెచ్‌సీ తనిఖీ

కిసాన్‌నగర్(బాల్కొండ), న్యూస్‌టుడే: కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. వైద్యురాలు ప్రవంతితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మందుల నిల్వ గది, ల్యాబ్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆర్మూర్ డిప్యూటీడీఎంహెచ్‌వో రమేష్ తదితరులున్నారు.

స్వచ్ఛత ప్రతిజ్ఞ



ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘం ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ రాజు, సిబ్బంది, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛతలో తమ వంతు పాత్ర పోషిస్తామన్నారు.

తాగునీరు కలుషితం కావొద్దు



మండలినీటి సహాయకులకు ధ్రువపత్రాన్ని ఇస్తున్న శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్

మాక్లూర్, న్యూస్‌టుడే: తాగునీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు శిక్షణ కలెక్టర్ సంకేత్‌కుమార్ సూచించారు. మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండలినీటి సహాయకుల శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తేవాలని పేర్కొన్నారు. అనంతరం మండలినీటి సహాయకులకు ధ్రువపత్రాలను అందజేశారు. మిషన్ భగీరథ డీఈ గంగారాం, ఏఈ అనిల్, ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ రైతు వేదికలో మిషన్ భగీరథ సహాయకులకు నాలుగు రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. డిప్యూటీ ఈఈ అమీర్ ఖాన్, ఏఈలు సమీర్, బస్వరాజులు శిక్షణ ఇచ్చారు.

6న బాల్కొండలో బీసీల సభ

బాల్కొండ: బాల్కొండలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ మహా సభను ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర నాయకుడు ఆకోగౌడ్ మూర్తి చెప్పారు. బాల్కొండలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాదార్యామ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.


ఏసీపీని కలిసిన తులసీకుమార్

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్ రెడ్డిని మంగళవారం పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు తులసీకుమార్ కలిశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇటుక పేర్చకుండా.. ఇల్లు కట్టకుండానే..!

- ఖాళీ స్థలాలకు అడ్డగోలుగా ఇంటి నంబర్లు
- ఆర్మూర్ బల్దియాలో అక్రమాలు

ఆర్మూర్ బల్దియా అక్రమాలకు అడ్డాగా మారింది. నీటిపారుదల శాఖ, అసైన్‌మెంట్ భూములు, లేఅవుట్ లేని ఖాళీ స్థలాలకు అడ్డగోలుగా ఇంటి నంబర్లు మంజూరు చేశారు. కాలువ గట్టు, దారి పెట్టు ఎక్కడైనా ప్రభుత్వ ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్కడ కమ్యూనిటీ భవనాలు నిర్మించేశారు. దీనిపై స్థానికంగా ఆరోపణలొచ్చినా ఇప్పటికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పురపాలక సభ్యులు ఆందోళనకు దిగినప్పటికీ, ఎమ్మెల్యే ఏకంగా సీఎంకు లేఖ రాసినప్పటికీ ఇంకా శాఖాపరమైన విచారణ ప్రారంభం కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.



న్యూస్‌టుడే, ఆర్మూర్

2022, నవంబరు నుంచి ఇప్పటి వరకు బల్దియా పరిధిలో ఎక్కడెక్కడ అనధికారికంగా అనుమతులిచ్చారనే దానిపై ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. మొత్తం సుమారు 600 ఇళ్లకు నంబర్లు ఇచ్చినట్లు గుర్తించారు. కౌన్సిలర్లు కొందరు ఆధారాలతో జాబితా అధికారుల ముందు ఉంచారు. 144 ఇళ్లకు ఇచ్చిన అసెస్‌మెంట్ నంబర్లను రద్దు చేశారు. తాజాగా మరో 25 ఇళ్ల నంబర్లను గుర్తించారు. ఇంకా లోతుగా పరిశీలిస్తే ఇంకో వందకు పైగా అక్రమ నంబర్ల బాగోతం బయటపడచ్చు.

ఇష్టారాజ్యంగా..

గతంలో పాలకులతో పాటు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఒక ఇంటికి అనుమతివ్వాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. వందల సంఖ్యలో అసెస్‌మెంట్ నంబర్లు ఇవ్వడం వెనుక ఎవరెవరి హస్తం ఉందనేది తేల్చకుండానే అధికారులు పనికానిచ్చేస్తున్నారు. ఓ అధికారి బదిలీపై వెళ్లేప్పుడు ఒక్క రోజులోనే దాదాపు 150 ఇళ్లకు నంబర్లు కేటాయించారని సమాచారం. అక్రమాలకు పాల్పడి వాటాలు పంచుకుని జేబులు నింపుకొన్నదెవరనే దానిపై పురపాలక శాఖ మిన్నకుండిపోయింది.

ఇవిగో సాక్ష్యాలు

☛ మామిడిపల్లి హనుమాన్ మందిరం సమీపంలో ఓ వ్యవసాయక్షేత్రానికి, సాయిగార్డెన్ ఎదురుగా, పాత నిమ్మల గార్డెన్ వెనుక భాగంలో, యానం గుట్ట వద్ద, లెదర్ పార్కు సమీపంలో ఒక్కో దగ్గర పదుల సంఖ్యలో ఇంటి నంబర్లు ఇచ్చారు. ఇక్కడ కేవలం గుడిసెలు, చిన్న పాటిగా ఇటుకలతో గదులు కట్టినట్లు చూపించారు.

☛ అంకాపూర్ రోడ్డులో వ్యవసాయ క్షేత్రాలకు పదుల సంఖ్యలో ఇంటి నంబర్లు ఇచ్చినట్లు గుర్తించారు. అక్రమంగా ఇంటినంబర్లతో రిజిస్ట్రేషన్ జరిగింది.

☛ పెర్కిట్ శివారులో జక్రాన్‌పల్లి మండలానికి చెందిన వ్యక్తి పేరున 1815 గజాలు, 1279 గజాలు, 536 గజాలతో అసైన్‌మెంటు భూమి నుంచి అక్రమంగా ఇంటినంబర్లతో రిజిస్ట్రేషన్ జరిగింది.



పెర్కిట్ శివారులో ఇంటి నంబరు కోసం తడకలతో వేసిన గుడిసె

☛ హౌసింగ్ కాలనీకి సమీపంలో సుమారు 2 ఎకరాల స్థలంలో ఒకే ఇంటి పేరున 12 వరకు నంబర్లున్నాయి. ఒక్కొక్కరికి 100-300 గజాల వరకు స్థలం ఉన్నట్లు అందులో చూపించారు. బల్దియా ఇచ్చిన నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఇక్కడ సదరు ప్రజాప్రతినిధి 30 శాతం వాటా తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.

అధికారులు పట్టించుకోవడం లేదు

నరసింహారెడ్డి, కౌన్సిలర్

ఆర్మూర్ పురపాలక పరిధిలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చారు. ఎన్నిసార్లు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. విజిలెన్స్ విచారణకు ఎమ్మెల్యే డిమాండ్ చేసినా ఉన్నతాధికారుల్లో స్పందన లేదు.

ఇంటి నంబర్ల రద్దు కొనసాగుతోంది

ఇప్పటివరకు సుమారు 170 ఇళ్ల నంబర్లను రద్దు చేశాం. ఇంకా సిబ్బందితో క్షేత్రస్థాయి విచారణ జరిపిస్తున్నాం. మరిన్నింటిని గుర్తించే పనిలో ఉన్నాం. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నాం. బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. **రాజు, కమిషనర్, ఆర్మూర్ బల్దియా**

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ రవికుమార్ అన్నారు. మంగళవారం బస్టాండ్ ఆవరణలో అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. తక్కువ ధరలకు నిర్ణీత సమయంలోనే కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పారు, కంట్రోలర్, కార్గో సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

నందిపేట్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీసీసీబీ నందిపేట్ శాఖ మేనేజర్ రాధ అన్నారు. స్వచ్ఛ భారత్ దివస్‌ను పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్ గ్రామంలో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. లైట్లు ఏర్పాటు చేయాలి. **-సాయన్న, డొంకేశ్వర్**

సమాధానం: వీధి లైట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

-శేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి

మురుగు కాలువ శుభ్రం



నందిపేట: నందిపేట్‌లోని పాతూర్‌లో మురుగు కాలువ సక్రమంగా శుభ్రం చేయడం లేదని పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించారు. మంగళవారం మురుగు కాలువల శుభ్రం చేశారు.

బతుకమ్మలు పేర్చి.. ఉత్సాహంగా ఆడిపాడి!



బాల్కొండలో..



ఆర్మూర్ లోటస్ పాఠశాలలో..



దేగాంలో..



పెర్కిట్ కాంతిలో..



చేపూర్‌లోని క్షత్రియలో..



పచ్చలనడుకుడలో..



ఆర్మూర్ నారాయణలో..



బాల్కొండ ఆదర్శ పాఠశాల, కళాశాలలో..



మామిడిపల్లి నలందలో..



ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు సాంస్కృతీ ప్రదర్శనలు చేపట్టారు. బతుకమ్మ ఆడి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం



చేపూర్‌లో..



ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



స్మైల్స్ పాఠశాలలో..



భాషితా బడిలో..



ఆర్మూర్ విజయ్‌లో..



కమ్మర్‌పల్లిలో..



అమీర్‌నగర్‌లో..

మాక్లూర్ కేజీబీవీ సిబ్బంది మధ్య వివాదం

నిజామాబాద్ విద్యావిభాగం: మాక్లూర్ కేజీబీవీలో కొంతకాలంగా సిబ్బంది మధ్య వివాదం తలెత్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో సమగ్ర విచారణ చేపట్టాలని డీఈవో దుర్గాప్రసాద్ జీసీడీవో భాగ్యలతను ఆదేశించినట్లు తెలిసింది. ఓ అధికారిణి విద్యార్థుల ముందే తమను దూషిస్తున్నట్లు సిబ్బంది ఉన్నతాధికారుల ఎదుట వాపోయినట్లు సమాచారం. జీసీడీవోని వివరణ కోరగా. . కొంత సమన్వయలోపం ఉందని, విచారణ కొనసాగుతుందని, నివేదిక డీఈవోకి అందజేస్తామని స్పష్టం చేశారు.

బోల్తా పడిన లారీ

బాల్కొండ: బాల్కొండ బైపాస్ రహదారిపై మంగళవారం సాయంత్రం లారీ టైరు పగిలి అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ శుభం, క్లీనర్ రోషన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

విభాగినిని ధ్వంసం

ముప్కాల్,(బాల్కొండ): ముప్కాల్‌లో మార్కెట్ ప్రాంతంలో విభాగిని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. ఆర్మూర్ గ్రామీణ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ రజినీకాంత్ మంగళవారం పరిశీలించారు.

ముగిసిన అంతర్ పాఠశాలల క్రీడలు

భీమ్‌గల్, న్యూస్‌టుడే: మూడురోజులుగా కొనసాగిన మండల అంతర్ పాఠశాలల క్రీడలు సోమవారం ముగిశాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీలో గెలుపొందిన జట్లకు క్రీడల కన్వీనర్ డి.స్వామి, పద్మ గంగ వీరయ్య ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీశ్వర్ జ్ఞాపికలను అందజేశారు. అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో సరస్వతీ విద్యామందిర్ ప్రథమ, కృషి ఉన్నత పాఠశాల ద్వితీయ, ఖోఖో అండర్-14 కృషి ఉన్నత పాఠశాల ప్రథమ, భీమ్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయస్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు శెవ్వ అశోక్, క్రీడల కోకన్వీనర్ రమణమూర్తి, పేటా ఛైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, అజిత్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు ఎడ్ల శేఖర్, కార్యదర్శి రాసదయాకర్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న క్రీడల కన్వీనర్ తదితరులు

ఓటరుగా నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న కన్వీనర్ జెస్సు అనిల్

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం ఈనెల 3 నుంచి ప్రారంభం అవుతోందని భాజపా ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్ అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల అభ్యర్థులను గెలిపించినట్లే, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ భాజపా అభ్యర్థిని గెలిపించాలని కోరారు. పట్టభద్రులు కచ్చితంగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. . ఆర్మూర్ మండల భాజపా అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి యుగంధర్, రాజ్‌కుమార్, ఉదయ్, సతీష్ పాల్గొన్నారు.

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్‌లోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు అశోక్, పట్టణాధ్యక్షుడు పతని, మండల ప్రధాన కార్యదర్శి సోమనవతేజ్, నరసింహ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు మామిడిపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో అదనపు లోడు భారం తగ్గించేందుకు నూతనంగా 5.1 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌పార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. డీఈఈ హరిచందర్ నాయక్ ఉత్తర్వుల ప్రకారం రూ.80 లక్షల విలువ గల పవర్ ట్రాన్స్‌పార్మర్ మంజూరు అయిందని తెలిపారు. ఆయన వెంట ఎస్పీఎం నటరాజ్, సిబ్బంది ఉన్నారు.

లక్ష్యం నిర్దేశించుకొని చదవాలి



డీఐఈవో రవికుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

బాల్కొండ, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తుకు ఇంటర్ ఎంతో కీలకమైందని డీఐఈవో రవికుమార్ అన్నారు. బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థుల (ఫ్రెషర్స్) దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ణయించుకుని ప్రణాళిక ప్రకారం చదవాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. డీఐఈవో రవికుమార్‌ను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ రజియొద్దీన్ అస్లం, నిజామాబాద్ బాలికల కళాశాల, ఆర్మూర్, భీమ్‌గల్, మోర్తాడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు బుద్ధిరాజ్, విజయనంద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు సన్మానం



ఏర్గట్ల: దోంచందకు చెందిన లింగారెడ్డి కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ నవనాథపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు పార్కులో సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, సభ్యులు ఉదయ్, విజయానంద్, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోంది'

మోర్తాడ్: ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి ఆరోపించారు. మోర్తాడ్‌లోని భారాస కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి లేకుండానే అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారని మండిపడ్డారు. మండలాధ్యక్షుడు ఏలియా, మాజీ జడ్పీటీసీ రవి, అశోక్‌రెడ్డి, ఆనంద్, మోహన్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడా పరికరాల అందజేత

ఏర్గట్ల, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి సుమారు రూ.50వేల విలువ గల క్రీడా సామగ్రిని తడపాకల్ ఉన్నత పాఠశాలకు మంగళవారం అందజేశారు. వాలీబాల్ నెట్, ఖోఖో పోల్స్, వాలీబాల్ పోల్స్, స్పోర్ట్స్ దుస్తులు, వీటితో పాటుగా రూ.లక్ష విలువచేసే డెస్కులు ఉన్నాయి.

జీవన భృతి అందించాలని ర్యాలీ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: బీడీ కార్మికులకు రూ.4016 జీవన భృతి అందించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆలూరు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి ముత్తన్న మాట్లాడారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నజీర్, శ్రీనివాస్, మనోజ్, శ్రీలత, రోజా, రవళి, కావేరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించిన పోలీసులు

కొత్తపల్లి(బాల్కొండ): ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన ఒక వ్యక్తి ఆగస్టు 3వ తేదీన సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి రూ.1,14,998లను తన బ్యాంకు ఖాతాలో నుంచి పోగొట్టుకున్నాడని ఎస్‌ఐ రజినీకాంత్ తెలిపారు.

అవీ...ఇవీ.. అన్నీ

బాధితుడు ముప్కాల్ పోలీస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఖాతాను వెంటనే హోల్డ్‌లో పెట్టించారు. రూ.1,14,998లను మంగళవారం ఉదయం తిరిగి జమ చేయించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బాధిత కటుంబాలకు పరామర్శ

బాల్కొండ: బాల్కొండ మండలంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. బాల్కొండ పహిల్వాన్ కాలనీలో ఖాదర్ మృతి చెందడంతో ఆయన ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిట్టాపూర్‌కు చెందిన రాకేష్ ఇటీవల హత్యకు గురికాగా, బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. బాల్కొండ, కిసాన్‌నగర్, నాగాపూర్‌లో పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను కలిశారు.

ఎమ్మెల్యేకు పీఆర్టీయూ సన్మానం

వేల్పూర్(కమ్మర్‌పల్లి): వేల్పూర్‌లో పీఆర్టీయూ మండల కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు దేవానందం, కార్యదర్శి సీవీ నరసింహస్వామి పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



వేల్పూర్ (కమ్మర్‌పల్లి): వేల్పూర్ మార్కెట్ యార్డు వద్ద సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి మంగళవారం ప్రారంభించారు. డీసీసీబీ ఛైర్మన్ రమేశ్‌రెడ్డి, వీఎంసీ వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి, శ్రీధర్, ఆత్మరాం పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ ఎంపికలు

ఆర్మూర్ పట్టణం: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్ బాల్ ఎంపికలను మంగళవారం ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 11 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్, ప్రధాన కార్యదర్శి సురేందర్, కోశాధికారి రాజేశ్, ప్రిన్సిపల్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

దూద్‌గాం(బాల్కొండ): మెండోరా మండలం దూద్‌గాంలో మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు దొంగలు నంద స్వప్న అనే మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారని ఎస్‌ఐ నారాయణ తెలిపారు. దూద్‌గాం వద్ద జాతీయ రహదారి పై వంతెన కింద ఈ ఘటన జరిగిందని చెప్పారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కొరియర్‌లో...

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్ పట్టణంలోని బ్లూడాట్ కొరియర్‌లో చోరీ జరిగినట్లు నిర్వాహకులు మంగళవారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి సుమారు రూ.80 వేల విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.